గ్రామ స్వరాజ్యానికి తూట్లు

అల్లిపురం: గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోంది. ప్రతి 2 వేల మందికి ఒక సచివాలయం చొప్పున ఆయన ఏర్పాటు చేశారు. ఇప్పుడు వాటిని ఒకే ప్రాంగణంలోకి తరలిస్తున్నారు. దీనిపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన..

గత ప్రభుత్వంలో 50 ఇళ్లకు ఒక వలంటీర్ ద్వారా లబ్ధిదారుల ఇళ్లకే పథకాలు వచ్చి చేరేవి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వలంటీర్ వ్యవస్థ కనుమరుగైంది. ఇప్పుడు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మళ్లీ పాత రోజులు కళ్ల ముందు ఆవిష్కృతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్పదని వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు తమ పనులు చేసుకోవాలంటే ఇల్లు కదలాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుమ్మరివీధి, వుడ్ యార్డ్ సచివాలయాల తరలింపు..

జీవీఎంసీ 33వ వార్డులోని కుమ్మరివీధి, వుడ్‌యార్డ్ సచివాలయాలు వెంకటేశ్వరమెట్ట 1,2 సచివాలయాలల్లోకి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తక్షణమే కుమ్మరివీధి, వుడ్‌యార్డ్ సచివాలయాలను ఖాళీ చేయాలని ఇటీవల ఆర్‌ఐ స్థాయి వ్యక్తి వక్తి సచివాలయ కార్యదర్శులను ఆదేశించడమే కాకుండా బెదిరింపులకు కూడా పాల్పడినట్లు సమాచారం. తాముఎలా తరలిస్తాం.. మీరే తరలించండని కార్యదర్శులు చెప్పటంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. సచివాలయాల తరలింపును వార్డు ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.



కుమ్మరివీధి, వుడ్‌యార్డ్ సచివాలయాలు

సచివాలయాల తరలింపు
- ఖాళీ చేయాలని ఆర్‌ఐ బెదిరింపు
- తరలించాల్సింది ఎవరని నిలదీసిన కార్యదర్శులు
- వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని ప్రజల మండిపాటు



వెంకటేశ్వరమెట్ట 1,2 సచివాలయాలు

గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడుస్తున్నారు..



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకు వచ్చేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ప్రజల వద్దకు పాలనను దూరం చేస్తోంది. మరోసారి ప్రభుత్వం ఆలోచించాలి.

– కాకి హరి శివ ప్రసాద్‌రెడ్డి, అల్లిపురం

సచివాలయం ప్రజలకు అందుబాటులో ఉండాలి..



సచివాలయ వ్యవస్థ అనేది ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రతి 2 వేల మందికి ఒక సచివాలయం ఉండటం వల్ల పని త్వరగా జరిగేది. ఇప్పుడు సచివాలయాన్ని 2 కిమీటర్ల దూరం తరలించడం సరికాదు. పాలకులు ఒకసారి ఆలోచించాలి.

– మొల్లేటి హరీష్, కుమ్మరివీధి

సచివాలయాల తరలింపు సరికాదు..



ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న సచివాలయాల తరలింపు సరికాదు. 2 వేల మందికి ఒక సచివాలయం అన్నప్పుడు సమర్ధవంతంగా పని చేశాయి. వాటిని క్రమేణా నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే తరలిస్తున్నారు. దీని వల్ల వృద్ధులు ఇబ్బంది పడతారు.

– పాల శ్రీహరిరెడ్డి, అల్లిపురం

మహిళలు ఇబ్బంది పడతారు..



సచివాలయాలను దూరంగా మార్చటంతో మహిళలు ఇబ్బంది పడతారు. కుమ్మరివీధి సచివాలయాన్ని వెంకటేశ్వరమెట్ట సచివాలయంలోకి మార్చడం వల్ల చాలా ఇబ్బందులు వస్తాయి. అధికారులు పునరాలోచించాలి.

– గంగుల మానస, వెంకటేశ్వరమెట్ట

సచివాలయాల తరలింపు తగదు



ప్రజల మన్ననలు పొందిన వార్డు సచివాలయాలను తరలించడం తగదు. ప్రజలకు అందుబాటులోనే ఉంచాలి. సచివాలయానికి వెళ్లాలంటే 2 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఎక్కడ ఉన్న సచివాలయాలు అక్కడే ఉంచాలి.

– నీలాపు అయ్యప్పరెడ్డి, నీలాపువారివీధి

ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలి



సచివాలయాలు ఉన్నచోట నుంచి తరలించే ముందు అధికారులు ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలి. ఈ పని వల్ల వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడతారు. వలంటీర్లు కూడా లేక పోవటంతో ప్రజలకు సేవలందే అవకాశం ఉండదు. ఎక్కడి సచివాలయాలు అక్కడే ఉంచాలి.

– పిల్లి శివ, బంగారుమెట్ట

క్లుప్తంగా

అన్నదానానికి వాసుపల్లి విరాళం



విరాళం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో ఆర్‌ఆర్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో ఆదివారం తన వంతు సాయంగా నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో వినాయకచవితి ఉత్సవాలు అంబరాన్నంటాయన్నారు. వినాయక నవరాత్రుల్లో భాగంగా జరుగుతున్న అన్నదాన కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంటుముచ్చు సాగర్, వార్డు అధ్యక్షుడు మహ్మద్ షకీల్, సనపల రవీంద్రభరత్, వాసుపల్లి బంగారమ్మ, కాకి పద్మ, పలువురు పార్టీ నాయకులు, ఆర్‌ఆర్ బాయ్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి వెంకటేశ్వరనగర్‌లో వింటేజ్ బార్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగి, ఎరుపు, నలుపు అడ్డచారల హాఫ్ హ్యాండ్ టీ షర్టు వేసుకుని, నలుపు రంగు ట్రాక్ వేసుకుని ఉన్నాడని, కుడిచేతిపై చరణ్ అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440796010, 0891–2746866 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని కోరారు.

దేశ ఆర్థిక పునర్వ్యవస్థీకరణపై సెమినార్



భాస్కర మోహన్‌ను సత్కరిస్తున్న ఏయూ పూర్వ విద్యార్థులు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏయూలోని సైన్స్ అండ్ టెక్నాలజీ భవన్‌లో ఎస్‌సీఎల్‌టీ, ఐబీసీ పాత్రపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. దేశ ఆర్థిక పునర్వ్యవస్థీకరణ, వ్యాపార నిలకడ, భారతీయ పరిశ్రమ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సెమినార్‌లో ఎన్‌సీఎల్‌టీ ముంబయి బెంచ్ మాజీ అధ్యక్షుడు భాస్కర మోహన్ ముఖ్యవక్తగా ప్రసంగించారు. కార్యక్రమంలో హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ డైరెక్టర్ (ఫైనాన్స్) కిరణ్ ఈశాంకరాల, వైజాగ్ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాగం కిషోర్ పాల్గొని వారి అభిప్రాయాలు వెల్లడించారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్ కె.వి.వి.రావు, వైస్ ఛైర్మన్ డాక్టర్.కె.కుమార్ రాజా, జనరల్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్, డాక్టర్ ఎస్‌కేవి అప్పారావు, వై.వి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం కోసం మొక్కలు



మొక్కలు నాటుతున్న యువకులు

బీచ్‌రోడ్డు: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు నీడ కల్పించేందుకు, ప్రాంగణంలో పచ్చని వాతావరణం నెలకొల్పేందుకు సోషల్ ఆర్పీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ముందుకొచ్చారు. వీరంతా మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటారు. వీరిని పోలీస్‌లు అభినందించారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు స్మార్ట్ రైస్ కార్డులు అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో గల సెబాస్టియన్‌కాలనీ, బాబూ కాలనీ సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ స్మార్ట్ రైస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పూర్ణిమ మాట్లాడుతూ ప్రజల సేవలో ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. గడప గడపకు వెళ్లినప్పుడు ప్రజలు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తున్నారని తెలిపారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరకాలంటే వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం పలువురికి స్మార్ట్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో లోకేష్, సచివాలయ అడ్మిన్ కిషోర్, సిబ్బంది నారాయణరావు, మహేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేళంగి జీరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, మధు, మురళి, ఆనంద్‌కుమార్, అన్నపూర్ణ, దేవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో అల్లూరి విగ్రహ ఏర్పాటుకు వినతి



పీవీఎన్ మాధవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సూరాడ అప్పారావు, సోంబాబు

దాబాగార్డెన్స్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేయాలని స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు నేతృత్వంలో పలువురు సభ్యులు ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. 2002లో పార్లమెంట్ అనుమతి పొందినప్పటికీ ఇప్పటి వరకు పార్లమెంట్‌లో ఏర్పాటు చేయలేదని, కేంద్రంతో మాట్లాడి అల్లూరి విగ్రహాన్ని పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు. మాధవ్ స్పందించి అధికారులతో మాట్లాడి, అల్లూరి విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని అప్పారావు తెలిపారు. మాధవ్‌ను కలిసిన వారిలో సంస్థ సభ్యుడు సోంబాబుతో పాటు పలువురు సభ్యులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు



క్షతగాత్రులు ఉదయ్, రాజేష్‌లకు సహాయం చేస్తున్న వాహన చోదకులు

అల్లిపురం: తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌పై ఆదివారం సాయంత్రం 4 గంటలకు ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంచరపాలెం, పాత ఐటీఐ జంక్షన్‌కు చెందిన ఉదయ్ (కార్పెంటర్), రాజేష్ (మెకానిక్ వర్కర్) ఆదివారం మధ్యాహ్నం ఆర్‌కే బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. సంపత్ వినాయక గుడి నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళ్తుండగా డివైడర్‌ను గుద్దుకుని పడిపోయారు. వీరిలో ఉదయ్‌కి ముఖం, చెంపలపై తీవ్ర గాయాలయ్యాయి. రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అటు వెళ్తున్న వారు వారిని చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. వారిని ఒక ప్రైవేట్ కారులో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందజేస్తున్నట్లు టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కారులో ఉదయ్‌ను తరలిస్తున్న దృశ్యం

ఘనంగా తెలుగు సాంస్కృతిక ఉత్సవాలు

మద్దిలపాలెం: త్వరలో జరగనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా ఆంధ్ర సారస్వత పరిషత్, కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో తెలుగు సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గాను ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. ఉత్సవాల్లో భాగంగా కర్నాటక సంగీతం, అష్టావధానం, కవి సమ్మేళనం వంటివి నిర్వహించారు. అష్టావధానంలో పాల్గొన్న పండితులను, కవి సమ్మేళనంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కవులను డాక్టర్ గజల్ శ్రీనివాస్ సత్కరించారు. చిన్నారులు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి అలరించారు. విశాఖ బీట్స్ గాయకులు సిరివెన్నెల, వేటూరి సుందరరామ్మూర్తి పాటలను ఆలపించారు. అలాగే కట్టా జేజీనారాయణ హరికథ గానం చేసి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. వరకట్న వేధింపులపై విజయనగరం మహిళా కళాకారులు ప్రదర్శించిన 'తనదాకా వస్తే' నాటిక అందరినీ ఆలోచింపజేసింది. ముగింపులో డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆలపించిన గజల్స్ ప్రేక్షకులను మైమరపించాయి. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శులు జీఆర్‌కే ప్రసాద్, చక్రవధానుల రెడ్డప్ప దవేజీ, గౌరవ సలహాదారు బాబు శ్రీ డాక్టర్ ములుసు అపర్ణ, ఉపాధ్యక్షులు కడిమెల్ల వరప్రసాద్ సహస్రావధాని, మేడికొండ శ్రీనివాస్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందిస్తున్న గజల్ శ్రీనివాస్

పేద మహిళకు నిత్యావసర సరకుల పంపిణీ



పేద మహిళకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీలో నివాసం ఉంటున్న జగదాంబ అనే మహిళ పేదరికంతో బాధపడుతోంది. ఆమె కుమారుడు వికలాంగుడు. వారిని ఆదుకునే ఉద్దేశ్యంతో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆదివారం పార్టీ వార్డు కార్యాలయంలో నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులకు నగదు అందజేశారు. ప్రతినెలా నిత్యావసర సరుకులు అందజేయనున్నట్లు ఆ కుటుంబానికి కోడిగుడ్ల శ్రీధర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వేళంగిజీరావు, కుమార్, శ్రీను, మధు తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో ఓ కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, హనుమంతవాక వైపు నుంచి అడవివరం వైపు వెళ్తున్న కారు దారపాలెం వద్ద ఆదివారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుతున్న వ్యక్తి కాలు విరిగిపోయింది. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. ఆ రెండు వాహనాలు బీఆర్‌టీఎస్‌లో మధ్య లైన్‌లో ప్రయాణించడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాదంపై ఫిర్యాదు నమోదు కాలేదని ఆరిలోవ పోలీసులు తెలిపారు.

సాయి హెల్పింగ్ హ్యాండ్స్‌కు రాష్ట్రస్థాయి సేవా అవార్డు

పెందుర్తి: వైద్యం, రక్తదానం, నేత్రదానం, అవయవదానం అంశాల్లో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్‌కు ప్రజా సంకల్ప వేదిక సంస్థ 2025కు గాను రాష్ట్రస్థాయి సేవా రత్న అవార్డు–2025తో సత్కరించింది. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్‌కు ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు మదిరే రంగ సాయిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో నిరుపేదలకు సేవలు అందిస్తామన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన



శిక్షణలో పాల్గొన్న దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు

ఎంవీపీకాలనీ: ఊపిరితిత్తుల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో కీలకమైన ఈబీయూఎస్ (ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్) టెక్నాలజీపై మెడికవర్ హాస్పిటల్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మెడికవర్ హాస్పిటల్స్, ఒలింపస్ మెడికల్ సిస్టమ్స్ సంయుక్తంగా దేశ వ్యాప్తంగా ఉన్న పల్మనాలజీ నిపుణుల కోసం ఈ శిక్షణను నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ పల్మనాలజిస్టులు డాక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ సుధీర్ థాలే మాట్లాడుతూ మానవులను వేధిస్తున్న వ్యాధుల్లో ఊపిరితిత్తుల వ్యాధులు ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఈ సమస్యపై వైద్యుల్లో అవగాహన పెంచేందుకు ఈ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా నిపుణులు సిద్ధాంతాలు, చికిత్స విధానాలు, వినియోగాలు, ప్రాథమిక సూత్రాలను వివరించారు. కార్యక్రమంలోపలువురు వైద్యులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి ఢిల్లీరావు



ఢిల్లీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దాబాగార్డెన్స్: కార్మిక వర్గం సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేసి కార్మిక పక్షాన నిలబడిన నేత ఢిల్లీరావు అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పేర్కొన్నారు. ఢిల్లీరావు సంస్మరణ సభ ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఎం.రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఢిల్లీరావు చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకుడు పెతకంశెట్టి వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు నిలబడిన వ్యక్తి ఢిల్లీరావని చెప్పారు. పార్టీ ఆదేశాల మేరకు ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్లి పని చేసేవారన్నారు. గంగవరం పోర్టు, స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాలకు నాయకత్వం వహించారని, కార్మిక రాజ్యం, దోపిడీ రహిత సమాజం కోసం పని చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బి.పద్మ, బి.జగన్, బి.ఈశ్వరమ్మ, బి.వెంకట్రావు, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా అన్నసమారాధనలు



అన్నసమారాధనలో పాల్గొన్న రమేష్ తదితరులు

అల్లిపురం: అమ్మవారి వీధిలో కోదండరామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్, వార్డు సీనియర్ నాయకుడు పచ్చిరిపల్లి రాము పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా వారు వినాయకునికి పూజలు నిర్వహించారు. అనంతరం వారు అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులకు స్టీలు గిన్నెలు, బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పీతల వాసు, కనకల ఈశ్వర్ తదితరులు

వెంకటేశ్వరనగర్‌లో..

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు వెంకటేశ్వరనగర్‌లో వినాయక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. వెంకటేశ్వరనగర్ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి కనకల ఈశ్వర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి చంద్రమౌళి, యలమంచిలి సంతోష్‌కుమార్, పైబోడి శివకుమార్, శ్రీరామ్, స్థానిక యువకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల జీవనోపాధికి గండి

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలు, వ్యాన్‌లు, జీపు డ్రైవర్ల ఉపాధికి గండి పడిందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ఫ్రీ బస్ పథకంలో ఆదాయం కోల్పోయిన డ్రైవర్లకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించాలని డిమాండ్ చేస్తూ అక్కయ్యపాలెం హైవే కూడలిలో ఆదివారం డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటి ప్రభుత్వం వచ్చాక ఇంధనం, నిత్యావసర సరకులు, వాహన విడి భాగాల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దీనికి తోడు పెంచిన జరిమానాలు ఆటో డ్రైవర్లకు కునుకు లేకుండా చేస్తున్నాయని తెలిపారు. ఉబర్, ర్యాపిడోతో ఇప్పటికే 40 శాతం ఆటో డ్రైవర్లకు ఉపాధి పోయిందని, చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో మరో 30 శాతం నష్టపోయామన్నారు. ఆటో డ్రైవర్ల ఉపాధికి నష్టం కలిగించే ఉబర్, ర్యాపిడో అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల హామీని తక్షణం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రవికృష్ణ, కేలం శివ, కె.నూకరాజు, జి.నందీశ్వరరావు, శంకర్, సీహెచ్ శ్రీనివాసరావు, నర్సింగ్, ఈశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు